# కొండవాడు

శ్రీ క్రొవ్విడి లక్ష్మన్న

[ గురి తప్పకుండా తుపాకి గానీ, బాణం గానీ వదలడం ఉగ్గుపాలతో నేర్చిన విద్య ఆటవిక జాతుల వారికి. వాళ్లు అవసరం అయితే తుపాకి పేల్చగలరు; కన్నీరు కార్చగలరు. భారత దేశం పరాధీనంలో వున్నప్పుడు వ్రాసిన కథ. ఇప్పుడు ఈ పరిస్థితులు మారినాయా? వారి నైపుణ్యం ఇప్పుడు దేశానికి ఎంత మాత్రం ఉపయోగించుకుంటున్నాము? ఒక్కమారు అందరూ ఆత్మ పరిశీలన చేసుకోవలసిన సందేశం యిచ్చే కథానిక. శ్రీ క్రొవ్విడి లక్ష్మన్న గారు ప్రత్యక్ష అనుభవాన్ని రంగరించి వ్రాసిన కథానిక. ]

అబ్బో! ఇవాళా నిన్నానా ? ముప్పై యేళ్ళ క్రితపు ముచ్చట!

అయినా, తలుచుకున్నప్పుడల్లా ఒళ్ళు ఝల్లుమంటూనే ఉంటుంది.

హఠాత్తుగా మమ్మల్ని "సిబీ" వెళ్ళమన్నారు. మేపులూ, స్కెచ్చూ పుచ్చుకుని కార్యక్రమం ముషాయిదాగా వేసుకున్నాం ఓగంటలోను. తిరువేంద్రం నుంచి చెన్నపట్నం, అక్కణ్ణుంచి గ్రాండ్ ట్రంకులో ఢిల్లీ తరవాత లాహోరు, ఆపైని "సిబీ"ని సిబీనుంచి క్వెట్టా అంది పుచ్చుకున్నట్టుంటుంది.

అక్కడే వచ్చిపడింది వ్యాసఘట్టం. ఇంకా లోపలికి జొచ్చుకుపోవాలి; ఆఫ్ఘన్‌స్థాన్‌లో మా స్థావరాలు పదిలపరుచుకోవాలి. మహా క్లిష్ట పరిస్థితి- ఏమంటారా? అక్కడ అంతా కొండ వాళ్ళు! తురక వాళ్ళున్నూ. ఒట్టి పశుప్రాయులు. శంకా సమాధానాలంటూ వుండవు. వాళ్ళకి చెయ్యి చేసుకోవడమే గాని నోరుచేసుకోవడం యెప్పుడూ ఎరుగరు అదైనా యెక్కడో పొంచి ఉండి అర్ధరాత్రో, అపరాత్రో మీద విరుచుకుపడతారు. ఒంటిగా ఆ ప్రాంతాల్లో తిరుగాడినవాడు తిరిగి నిరపాయంగా శిబిరానికి చేరుకున్నాడంటే యముణ్ణి జయించేడన్నమాటే! అందులోనూ మా జట్టులో ఒక "సిక్కు" కూడా ఉన్నాడు. ఆతను జాకీలాగ మూరెడు బవిరిగడ్డాం దిగదువ్వుకుని. "అన్యమతసులని పరిమార్చడమే మోక్షప్రదం అని నమ్ముతారు వాళ్ళు. జాగ్రత సుమండీ!" అన్న హెచ్చరికతో బయలుదేరేం. ఆ మాటలు నా చెవుల్లో గింగురుమంటూనే ఉన్నాయి. సూట్లూ, బూట్లూ వేసుకోవడంవల్ల షేం

కొంత కమ్మకుపోగలం అని ధైర్యం చెప్పుకున్నా. ఆ గడాపాయన దగ్గిరే వొచ్చేది గొప్పచిక్కు.

## 2

ఓనాడు ప్రొద్దున్నే వాళ్ళ పహరా కనిపెడదాం అని బయలుదేరేను. మేకల మందని తోలుకుపోతున్నాడు ఓ కుర్రాడు. చిత్రం ఏవిటా? వాడిచేతిలో చేపాటు కరకు బదులు తుపాకీవుంది. తొడుక్కున్నది ఒక చెయ్యిలేనిచొక్కా. వాడితండ్రిదో పినతండ్రిదో కాకీ నిక్కరూను – పదహారు పద్దెనిమిదేళ్ళకన్న ఉండవు; కాని మనిషి ఆజానుబాహు. ఆరడుగులు పైని ఉంటాడు. దవడలు కమ్మెచ్చుల్లాగ ఉన్నాయి. బల్లపరుపుగా విశాలం అయిన ఛాతీ బొత్తాయి బరేన్ని ఆ చొక్కా వాడికి చాలదని చెబుతోంది. నిక్కరు జేబులు ఎత్తుగా ఉన్నాయి. వీడి పై ఖరి వింతగాతోచి వెంటపడ్డాను.

ఇరవై గజాలు వెనకఉన్న నన్ను యెలాగ పసికట్టేడో, వేటకుక్కలాగ గబుక్కున తిరిగి తుపాకీ యెత్తేడు. అంతలోకే నా దుస్తుల మావలత్తు చూసే కాబోలు. యెత్తిన తుపాకీ దించి సలాం చేసి తన దారిని పోబోయేడు.

"ఏయ్!" అని పిలిచేను వాడు తిరిగి నుంచున్నాడు.

"తుపాకీ యెక్కడిదీ?" హుందాగా ప్రశ్నించేను.

"నాదే"

ఆ జవాబులో యెంతమాత్రం కళవళలేదు.

"ఎందుకు పట్టుకెళుతున్నావ్!"

"ఎందుకేఁవిటి, నిత్యం చూస్తూను? మామూలుగానే పట్టుకెళుతున్నాను."

మాట పెళుసుగా ఉందన్నమాటే గాని, హృదయంలో యే కల్మషంలేదు. కాగా; నేను అక్కడి అధికారవర్గంలో వాణ్నేనన్న భ్రమలో ఉన్నాడు. అసలు సంగతి యెందుకు చెప్పాలీ? చెబితే ఏం కొంప ములుగుతుందో!

"సరేవెళ్ళు."

నిర్భయంగా, ఎప్పటిలాగా నడక సాగించేడు వాడు. జేబులో రివాల్వరు భద్రంగా ఉన్న సంగతి నిశ్చయ పరుచుకుని మరీ వెంటపడ్డాను నేను.

అంతా కాలిబాటే, రోడ్డుకాదు, రాళ్లూ రప్పలూ చిందర వందరగా ఉన్నాయి. బాటమ్మట. త్వరగా కాళ్ళు పీకడం ఆరంభించేయి. నాగరికతా,నాజూకూ పెరిగి పోయి వొట్టి జపాను సరుకయిపోయేను. రండికీ మొండికీ ఓర్చి పని చెయ్యాలంటే నా వశమా? వాడి ధర్మాఁనా అని మరో పది గజాల్లో మందని పక్క గుట్టవేపు మళ్ళించి, ఓ బండరాతి మీద చతికిల బడ్డాడు. బతికేం భగవంతుడా అని నేనూ ఉన్నచోటే కూలబడ్డాను.

తుపాకీ ఓసారి చేతుల్లోకి తీసుకున్నాడు. వాడు – పసి పాపని రెండు చేతులతోటీ యెగరవేసినట్లు, ఆ ఆయుధాన్ని అతి ఆప్యాయంగా అరిచేతుల్లో ఉంచుకుని అల్లల్లాడించేడు. నిశ్శబ్దంగా పెదిమెలు పక్కకి పరిగెత్తేటట్లు దరహాసంచేసి, సంతోష హృదయంతో దాన్ని పక్కనే నుంచోబెట్టేడు.


అంతలోకే ఓ చిన్న మేక పిల్ల అరిచింది. ఛట్టున తలయెత్తి చూసేను. నేనూ అప్రయత్నంగా ఆ వంకనే దృష్టి సారించేను. పోతుమేక ఒకటి దాన్ని కుమ్ముతుంది. ఒక్క దాటులో వెళ్ళేడు. మేకపోతు డొక్కలో ఒక్కతాపుతన్ని పిల్లని ముచ్చటగా రెండు చేతుల్లోనూ పొదివిపట్టుకుని ముట్టె ఆఘ్రాణించేడు. దాన్ని అలాగ చేతుల్లో యిముడ్చుకునే ఉల్లాసంగా వెర్రి గంతులు వేసేడు. తరవాత భద్రంగానే దింపి, దాని వీపు తట్టేడు. అది ఎగురుకుంటూ "మే మే" అని అరుస్తూ తల్లి దగ్గరకు పోయి పొదుగులో మూతి పెట్టింది. వీడు దానివేపే రెప్పవేయకుండా చూసేడు. హృదయం తెరచుకునేట్టుగా నవ్వి పాలు తాగుతున్న దాని పక్కనే నుంచున్నాడు. పొట్ట నిమురుతూను. కొండవెధవకికూడా ఎంత జాలిగుందె!

పది నిమిషాలు గడిచేయి. వాడు తిరిగి వచ్చి బండరాతిమీద కూర్చున్నాడు. నిక్కరు జేబులో చెయ్యిపెట్టి ఓ పొట్లం పైకి తీసేడు. అది యేమిటో నని బైనాక్యులర్స్ పెట్టుకొని చూతూనూ? రొట్టెలు. మూడే మూడు రొట్టెలయినా, ఒక్కొక్కటీ ఆంధ్రపత్రికంత ఉన్నాయి. వాటికి నెయ్యీ నూనేయే వల్లకాడూలేదు. ఒట్టి పొడిరొట్టెలు. నిప్పులమీద కాల్చినవి. రెండు ఉల్లిపాయలు నంజుకుంటూ మూడురొట్టెలూ తినేశాడు. మంచినీళ్ళ ప్రసక్తేలేదువాడికి. మనలాంటి వాళ్ళం అయితే అడుగడుగునా ముద్ద మెడబడిపోయి, గొంతుదిగక మూడు చెంబుల నీళ్ళు ఖాళీ చేసేవాళ్ళం. ఆరి పిడుగా! అనుకున్నాను. నిమిషంలో, చప్పట్లుకొట్టినట్టు చేతులు దులుపుకుంటూ లేచి నిలబడ్డాడు. రెండో జేబులోంచి తూటాలుతీసి తుపాకీ యెత్తి బారుగా అమర్చేడు.

నాకు కంగారు పుట్టింది ఏం చేస్తాడు చెప్మా? ఏ అమాయిక జీవికి నేటితో నూరేళ్లు నిండాయో! వీణ్నే నా రివాల్వరుతో కాల్చేస్తే? ఆ శబ్దానికి చుట్టు పక్కలనుంచి వాళ్ళు వాళ్ళు నన్ను ముట్టడించి హతంవార్చేస్తారు కాబోలు! కాకపోయినా ఒక్కడిని బయలుదేరడం యేమిటట నా మొహం. యేదో తర్జనభర్జనచేస్తూనే ఉన్నాను....

వాడు మెట్లుదిగుతూ పుచ్చుకున్నాడు కుడిచేత. ఎడమచేతిలో తుపాకీ ఉంది. రాయి రివ్వున అంతరిక్షానికి విసిరేడు. తుపాకి కుడి భుజంకిందకు వచ్చింది. గుండెకి ఆనుకుంది 'బేరెలు' క్రిందకి ఎడమచెయ్యి ప్రసరించింది. ఎడమ కన్ను ముయ్యడం కుడిది తెరవడం, కుడిచేతి చూపుడు వేలితో 'ట్రిగ్గరు' లాగడం క్షణకాలంలో జరిగిపోయేయి. నేను మాటల్లో చెప్పడంలే ఆలస్యం అవుతోంది అనుకోండి. ఎగిరిన రాయి ఆకాశంలోనే చిన్నాభిన్నం అయిపోయి తునకలుగా కిందపడిపోయింది. ఏమి గురి! ఎంత త్వరితం!! రెప్ప వెయ్యకుండా, బైనాక్యులర్సు దించకుండా ఆశ్చర్యంతో అరగంటసేపు చూసేను. మనవేపు పశువుల గుంటలు గోళీకాయలు ఆడుకుంటారు. వీళ్ళకి యిదీ పని!

శహబాస్!




వీళ్ళకే సరిఅయిన సంస్కృతి కల్పించి, క్రమమైన శిక్షణ యిచ్చినట్ల యితే దేశమంతకి ఎంత చక్కని అంగరక్ష యేర్పడుతుందో కదా అని విస్తుబోయేను. అటువంటి నేర్పరులని క్రౌర్యంచేతో, కానుకలిచ్చో మోసం చెయ్యడమా? ఏం హృదయరహితమైన పని? పరాధీనంలో ఉన్నంతకాలం భారత దేశానికి మరి ముక్తిలేదు. ఆలోచిస్తున్న కొద్ది కడుపు దేవుకుపోయింది. ఇంక నిలవలేక యింటి ముఖం పట్టేను-ఆకలీ, దాహం, చికాకున్నూ-నీరసించి పోతూన్నట్టు అనిపించింది....

ఎంత నడిచినా అంతు కనిపించదే?

ఎవరో పక్కనుంచే వెళుతూన్నట్టయింది.

"క్వెట్టా రహదారి యిక్కడికి ఎంత దూరం ఉంటుందీ?" అని అడిగేను.

పుష్తోభాషలో వచ్చింది జవాబు : "మీరు క్వెటారోడ్డు వదిలి అయిదు మైళ్ల ఆఫ్ఘన్‌స్తాన్‌లోకి వచ్చేరు"

"చచ్చేన్రా భగవంతుడా!"

మీకువచ్చిన భయంలేదు - మా ఆతిధ్యం స్వీకరించి కాస్త విశ్రమించి, సాయంత్రం మీయింటికి వెళుదురుగాని." భయంలేదని అతను అనడంతోటే నిజంగానే భయంవేసింది. తేరిబారి చూతునూ తురకవాడు!

"అఖర్లేదు మీ ఆహ్వానానికి చాలా సంతోషం నాదారిని నేను పోతాను-" నూతిలోనుంచి వచ్చినట్లు వచ్చేయి ఆ మాటలు. పొడి ఆర్చుకు పోయిన నా గొంతుకలోనుంచి.

మీరు అలాగ అనడానికి వీల్లేదు. అర్థించిన వాడికి అతిథి సత్కారాలు చెయ్యడం మా మతం. సంశయించక

రండి, పోదాం"

ఆ మాటలలో ఏంవీ వక్రతలేదు గిజామన్నా దొర వేడూకాడు ఇంటికి తీసుకుపోయేడు–నులక మంచం ఆసనం. రెండూ పొడి రొట్టెలూ, నాలుగుముల్లంగి దుంపలూ, పింగాణి గ్లాసునిండా మేక పాలూ పట్టుకు వచ్చేడు. నాటు ఫ్యాక్టరీలో తయారయిన తుపాకులు రెండు గోడని "లింటూమార్కు" లాగ తగిలించి ఉన్నాయి. వాటివేపు చూస్తూ గుండెలు బితుకు బితుకు మంటూనే ఆ ఆతిథ్యం స్వీకరించేను. ఆ తరవాత హుక్కా గొట్టాం నా ముందుంచేడు. ఏంవిటో యీ వింత వైఖరి!

## 3

ఆ సాయంత్రం పటాలం ఒకటి కొండ చరియలని ఆనుకుని వెళుతోంది. హఠాత్తుగా ఎక్కణ్నుంచో "ఢాం"మ్మని తుపాకీ పేలిన శబ్దం పటాలంలో ఒకడు బలి అయి పడిపోయేడు. దళ నాయకుడికి పట్టరాని కోపం వచ్చింది. కొండకి యిరుప్రక్కలా గురిచూసికాల్చమన్నాడు.

పావు గంటసేపు పటాలం మెషిన్ గన్స్ పేల్చింది. ఫలితం మాత్రం శూన్యం. పటాలం చరియలో ఉంది; పైన కొండమీద ఏ బండచాటున దాగున్నాడో ఆ కాల్చినవాడు. ఏ తుప్పచాటున పొంచి ఉన్నాడో!

మళ్ళీ ముందుకు సాగబోయింది పటాలం.

"ఢాం! ఢాం!! ఢాం!!!"

ముందున్న ముగ్గురూ పిట్టల్లాగ పడిపోయేరు. పటాలం నాయకుడు; రుద్రుడైపోయినాడు. కోపం, అవమానం అతన్ని చికాకు పరిచేయి. మళ్ళీ ఫైర్ ఆర్డరు!

అట్నుంచీ తుపాకీ పేలిన చప్పుడు మరొక పదిమంది పటాలంలో ఆహుతి అయి పడిపోయేరు. కొండలోయ యుద్ధభూమి అయి ఊరుకుంది. అంతలోకే కొండమీద, తుప్పచాటున ఏదో కదలినట్టయింది. ఆ చోటు సూటిగా కాల్చేడు నాయకుడు–"ఢాం".

ఈ సారి గురి తప్పలేదు. ఆ దెబ్బకి కొండమీద నుంచి దొర్లుకుంటూ వచ్చి పటాలం కాళ్ళ దగ్గర పడ్డాడు ఒకడు. పడ్డాడో లేదో స్ప్రింగు బొమ్మలాగ లేచి మరో ముగ్గుర్ని కాల్చేసేడు. నాయకుడి "బాయనెట్" డొక్కలో దూసుకు పోయేదాకా వాడు ప్రాణాలు కోల్పోలేదు. చివరికి అసువులు బాసినా ఆయుధం మాత్రం హస్త భాగాన్ని, అలంకరించే ఉంది, ఎవరో అనుకున్నాను. చూద్దునూ? వాడే ఆ పశువుల కుర్రాడు!

ఒంటి మనిషి సర్వాయత్తమైన ఒక పటాలాన్ని ఎదిరించి సుమారు రెండు గంటలసేపు నిరోధించేడు–పాతిక మంది నయినా బలిగొంచే నేగాని ప్రాణంత్యజించేడు కాడు. ఏంవి నైపుణ్యం! యెంత ధైర్యం!! ఎంతటి సాహసం!!!

పటాలం నాయకుడే మెచ్చుకున్నాడు.

మిలటరీ ఆనర్స్‌తో ఆ కొండవాడికి అంత్యక్రియలు జరిగేయి.

***